క్లుప్తంగా

ఉర్దూ పాఠశాలను కొనసాగించాలి

లింగసముద్రం: మండలంలోని పెదపవని గ్రామంలో యూపీ ఉర్దూ పాఠశాల కొనసాగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని యూపీ ఉర్దూ పాఠశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ, ముస్లిం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ఎం బాషా, గ్రామస్తులు కోరారు. గ్రామంలో యూపీ ఉర్దూ పాఠశాలలను 1947లో స్థాపించారని, ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. అయితే, అభివృద్ధి చెందుతున్న పాఠశాలను ప్రస్తుత ప్రభుత్వం భోరావ్ ఉన్నత పాఠశాలలోకి విలీనం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. విద్యాశాఖ అధికారులు ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ పెద్దల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉర్దూ పాఠశాలను విలీనం చేయడాన్ని వారు ఖండించారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి గ్రామంలో యూపీ ఉర్దూ పాఠశాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీపీసీఎల్‌కు భూములిస్తే ప్రజలకు మేలేంటి బాబూ.?

ఉలవపాడు: బీపీసీఎల్‌కు భూములిస్తే ప్రజలకు ఎలా మేలు జరుగుతుందని 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటన అంటే నియోజకవర్గ ప్రజలకు మేలు జరిగే విధంగా ఉంటుందని ఆశించారని, అసలైన సమస్య అయిన ప్రకాశం జిల్లాలో కలిపే విషయమై మాట దాటవేసి ఫ్యాక్టరీలు నిర్మిస్తే ప్రజల బతుకులు మారుతాయని చెప్పడం బాధాకరమని అన్నారు. లక్ష కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తే ఆ కంపెనీకి లాభం తప్ప ప్రజలకు ఏం ఉపయోగమని ప్రశ్నించారు. సముద్రతీరంలో అధిక శాతం నిరక్షరాస్యులే ఉంటే వారికి ఉద్యోగాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేయకుండా వారి భూములు దోచుకోవడానికి ముఖ్యమంత్రి పర్యటించినట్లు ఉందంటూ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని మాట ఇచ్చి ఇప్పుడు ఇలా మాట తప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు మాట తప్పారని అన్నారు.

నలుగురు పేకాటరాయళ్ల అరెస్టు

కొండపి: మండలంలోని తాటకులపాలెంలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి నిర్వహించారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13,640 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, కోడిపందేలు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇంకుడు గుంతల పనులు ప్రారంభం



ఇంకుడు గుంతల పనులను ప్రారంభిస్తున్న ఏపీఓ సుభాషిణి

టంగుటూరు: మండలంలోని ఎం. నిడమలూరులో ఇంకుడు గుంతల పనులను ఏపీఓ సుభాషిణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎం.నిడమలూరులో 18 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని, వాటి పనులు ప్రారంభించామని తెలిపారు. ఇంకుడు గుంతల వల్ల నీటిని ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపి కొండయ్య లబ్దిదారులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షిక వేడుకలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): కనిగిరి పట్టణంలోని ఎంఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల 33వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బాలికలు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- కనిగిరి డివిజన్‌లో ముమ్మరంగా కూరగాయల సాగు
- ధర బాగుండటంతో రైతులకు మంచి లాభాలు
- ఖర్చు తక్కువ కావడంతో మొగ్గు చూపుతున్న రైతులు

కూరగాయల సాగు.. లాభాలు బాగు



కాయ పూతతో ఉన్న బీర సాగు

హనుమంతునిపాడు:

కనిగిరి డివిజన్ ప్రాంతంలో కూరగాయల సాగు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. తక్కువ పెట్టుబడి కావడంతో రైతులు ఎక్కువ మంది కూరగాయల సాగుకు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది సాగు చేసిన చిరుధాన్య పంటలు వరుస వర్షాలతో పూర్తిగా దెబ్బతిని రైతులకు నష్టాలే మిగిలాయి. దీంతో రైతులు కూరగాయల సాగుకు రైతులు మొగ్గు చూపారు. వ్యవసాయ బోర్ల కింద రైతులు కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేశారు.

600 ఎకరాలకు పైగా..

ఉద్యానవన శాఖాధికారుల లెక్కల ప్రకారం కనిగిరి డివిజన్‌లో 600 ఎకరాలకు పైగా కూరగాయల సాగు చేసినట్లు ఉద్యానవన శాఖాధికారి అంజలీబాయి తెలిపారు. ఇవి కాక మరో 100 ఎకరాలకు పైగా సాగు చేసినట్లు తెలుస్తోంది.



సొరకాయలు

హనుమంతునిపాడు మండలంలో కిష్టంపల్లి, దాసరిపల్లి, లింగంగుంట్ల, వేములపాడు, దాసరిపల్లి, లింగారెడ్డిపల్లి, వాలిచర్ల గ్రామాల్లో అధికంగా కూరగాయల సాగు చేపట్టారు. ఈ గ్రామాల్లో టమాట, సొర, కాకర, బీర, దొండ, బెండకాయ, దోస, గోరు చిక్కుడు వంటి కూరగాయలు సాగు చేశారు. ఈ ఏడాది మార్కెట్‌లో మంచి ధరలు ఉండటంతో లాభాలు వస్తున్నాయని రైతులు తిరుపతిరెడ్డి, ఈదా బుజ్జి, తిరుపాలురెడ్డి, బుచ్చి తదితరులు చెబుతున్నారు. బీర రూ.40, దొండ, బెండకాయలకు కూడా మంచి ధరలు వస్తున్నాయి. దీంతో రైతులు నీటి వసతి ఉన్న గ్రామాల్లో కూరగాయల సాగు విస్తారంగా సాగు చేశారు.

పెట్టుబడులు పెరిగినా..

కూరగాయల సాగుకు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. కూలీ ధరలు పెరిగాయి. అయితే ఎక్కువ శాతం మంది రైతులు ఇంటిల్లిపాది పొలం పనులకు వస్తుండటంతో కూలీల ఖర్చు తగ్గిందంటున్నారు. దిగుబడులు బాగుండటం,, ధరలు కూడా కలిసి రావడంతో ఈ ఏడాది కూరగాయల సాగు చేసిన రైతులు ఈ ఏడాది మంచి రోజులు వచ్చినట్లయింది.



దిగుబడి బాగుంది:

15 ఏళ్లుగా నాకున్న 10 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నాయి. ఏటా పంట మార్పిడి విధానం అవలంబిస్తున్నాను. దీంతో తెగుళ్ల బెడద తప్పింది. ఈ ఏడాది టమోటా, బీర, బెండ, చిక్కుడు, సొర, కాకర పంటలు సాగు చేశాను. ఆశించిన దిగుబడులు రావడంతో పాటు ధరలూ బాగున్నాయి. టమోటాకు ఎకరాకు రూ.70 వేల వరకు వస్తుంది. బీరకు మంచి దిగుబడులు వస్తున్నాయి. ఇప్పటికే బీర మూడ కోతలు కోశాను. కిలో రూ.40 వంతున కనిగిరి మార్కెట్‌లో విక్రయించాం. పొదిలి, కంభం మార్కెట్‌లకు కూరగాయలు పంపిస్తున్నాం. ఈ ఏడాది కూలి ధరలు పెరిగాయి. అయినా దిగుబడి, ధరలు బాగుండటంతో లాభాలు వస్తున్నాయి.

ఈదర బుజ్జి, కిష్టంపల్లి



కిష్టంపల్లి వద్ద పూత పిందెతో ఉన్న టమోటా



లేతగా సాగు చేసిన బీర

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ఉత్సవానికి సిద్ధమైన పార్వతి, పరమేశ్వరుల ఉత్సవమూర్తులు

పామూరు: మండలంలోని గోపాలపురం వద్ద 565 జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన పార్వతీ పరమేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అర్చకుల వేద మంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న పార్వతి, పరమేశ్వరుడు, సుబ్రమణ్య, వినాయక, అయ్యప్ప, నవగ్రహ విగ్రహ మూర్తులకు ఆదివారం జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, వస్త్రాదివాసం వేదపండితులు శ్రీచిమటా కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, స్వామి శాంతి కల్యాణం, గ్రామోత్సవం జరగనున్నాయి.



ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు జలాధివాస పూజలు చేస్తున్న అర్చకులు

కార్మిక శాఖ తనిఖీలెక్కడ..?

- డాబాల్లో చిన్నారుల బాల్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఉలవపాడు: పాఠశాలకు వెళ్లి పుస్తకాలు పట్టాల్సిన చేతులు డాబాల్లో ప్లేట్లు, గ్లాసులు పట్టుకుంటున్నాయి. వారి కుటుంబ పేదరికం కావచ్చు.. ప్రభుత్వ నిర్లక్ష్యం కావచ్చు.. మొత్తంమీద బాల కార్మికులు మాత్రం అధికమయ్యారు. బడికి వెళ్లకుండా పనులకు వెళుతున్న పరిస్థితులు మండలంలో అధికంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారి వెంట డాబాల్లో అత్యధికంగా చిన్నారులు పనిచేస్తున్నారు. వారిలో కొందరు స్థానికులు కాగా, మరికొందరు ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందినవారు. ఈ హోటళ్లకు ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాలలో ఉన్నవారు వస్తుంటారు. కానీ, వారందరూ పనిచేయించుకోవడం తప్ప బాల్యంలో ఇక్కడ ఎందుకు పనులు చేస్తున్నారనే విషయం మాత్రం పట్టించుకోరు. ఇక, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం పనిచేయాల్సిన కార్మిక శాఖ, విద్యాశాఖ కనీసం పట్టించుకోని పరిస్థితి. జాతీయ రహదారిపై ఎలాంటి హోటళ్లు, డాబాలు నిర్వహించాలన్నా తమ వద్ద ఎలాంటి బాల కార్మికులు లేరని కార్మిక శాఖ నుంచి హోటల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ, అలాంటివేవీ ఇక్కడ ఉండవు. కార్మిక శాఖ అనుమతి ఉండదు. ఇలా ఎందరో భావిభారత పౌరుల బాల్యం హోటళ్లలో మగ్గిపోతోంది.



కరేడు ర్యాంపు సమీపంలో జాతీయ రహదారిపై ఓ హోటల్లో పనిచేస్తున్న బాలకార్మికుడు

అధికారుల నిర్లక్ష్యం...

ప్రధానంగా కార్మిక శాఖ, విద్యాశాఖ నిర్లక్ష్యం వలనే ఈ పరిస్థితి ఉందనేది వాస్తవం. కార్మికశాఖకు సంబంధించిన అధికారులు ఒక్కసారి కూడా జాతీయరహదారిపై ఉన్న డాబాలు, హోటళ్లను, దుకాణాలను తనిఖీ చేసిన సందర్భమే లేదు. గతంలో చైల్డ్‌లైన్ సంస్థ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతుండేవి. ఇప్పుడు వారి తనిఖీలు కూడా ఎక్కడా లేవు. కార్మిక శాఖకు సంబంధించిన అధికారులు మీ సేవ ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే ఎలాంటి పరిశీలన లేకుండానే అక్కడ బాల కార్మికులు లేరని సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. కానీ, జాతీయరహదారిపై ఉన్న డాబాలలో కనీసం ఆ సర్టిఫికెట్‌కు దరఖాస్తు కూడా చేయరు. ఒక్క హోటల్‌కు కూడా అనుమతులు ఉండవు. అయినా గ్రామ పంచాయితీగానీ, కార్మిక శాఖగానీ, విద్యాశాఖగానీ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఏ మాత్రం కృషి చేయని పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. మరోవైపు పాఠశాలల్లో డ్రాపవుట్లు అధికమవుతున్నారు. ప్రధానంగా గిరిజన కాలనీలలో చిన్నారులు పాఠశాలకు వైపు చూడకుండా పనులకు వెళుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో అధికారులు తనిఖీలు చేసి బాల కార్మికులను విద్య వైపు మరల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ



నారాయణస్వామి అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం నారాయణస్వామి అభిషేకోత్సవం అర్చకులు శ్రీమంకాల శివప్రసాద్ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో ఉన్న గోశాలలో గోపూజ చేశారు. అనంతరం మహానైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహానైవేద్య ప్రదక్షిణలో పాల్గొన్న ఈఓ, చైర్మన్, భక్తులు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

పొన్నలూరు: ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై అనూక్ అన్నారు. రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు పొన్నలూరులో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు విలువైన ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపరాదని, ఒకవేళ ఎవరైనా బైక్‌లు, వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకపోయినా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనూక్

ప్రభుత్వ పథకాలకు భూ ఆధార్ తప్పనిసరి

సీఎస్‌పురం(పామూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాలను రైతులు పొందాలంటే భూ ఆధార్ తప్పనిసరి అని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో, గ్రామాల్లో ఆదివారం భూ ఆధార్ ప్రక్రియ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూ ఆధార్ కోసం రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో పాటు ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్‌నంబర్ ఉన్న ఫోన్ తీసుకుని వీఏఏల వద్దకు వెళ్లాలన్నారు. భవిష్యత్‌లో 11 అంకెలు ఉన్న ఈకార్డు ఉంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాల రాయితీ, పంట నష్టపరిహారం, పెట్టుబడి, ఎరువుల రాయితి, కనీస మద్దతు ధర, పంట రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు.

పామూరు: రైతులు భూ ఆధార్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.రాధ అన్నారు. మండలంలోని తాతాయపల్లెలో జరుగుతున్న భూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూ ఆధార్ వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఎంతో సులభతరమవుతుందన్నారు. భూ ఆధార్ నమోదుకు వస్తున్న రైతులు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను తీసుకొని వీఏఏ వద్దకు వెళ్లాలన్నారు. పలు రైతుసేవాకేంద్రాల్లో నిర్వహిస్తున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను తనిఖీ చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు రైతులు పాల్గొన్నారు.



సీఎస్‌పురం రైతుసేవాకేంద్రంలో నమోదు చేస్తున్న భూ ఆధార్



తాతాయపల్లెలో భూ ఆధార్ నమోదును పర్యవేక్షిస్తున్న ఏఓ రాధ

పొలంలో మట్టి తవ్వకాలు ఆపాలి

టంగుటూరు: మా పొలంలో మట్టి తవ్వకాలు ఆపాలని, పొలం తిరిగి మాకు ఇప్పించాలని మండలంలోని ఎం నిడమానూరు గ్రామానికి చెందిన పొందూరు రమాదేవి అనే మహిళ ఎస్సై నాగమల్లేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొణిజేడు గ్రామంలోని సర్వే నంబర్ 346/5లో 2.5 సెంట్ల భూమిని పదేళ్ల నుంచి గుమ్మ పెద్దబ్బాయికి కౌలుకు ఇచ్చామని, అందులో జామాయిల్ సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే కౌలు ఇవ్వకపోగా బెదిరిస్తున్నాడని వాపోయింది. అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విన్నవించుకుంది.



మట్టి తవ్వకాలు చేస్తున్న పొలం

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి



ఉలవపాడు గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం

ఉలవపాడు: విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల బుక్ కీపింగ్ సెంటర్లలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో ఎంతో విలువైన పుస్తకాలు ఉంటాయని, వాటిని చదివి మంచి జ్ఞానం సంపాదించాలని సూచించారు. విద్యార్థులతో నీతికథలు, మహనీయులు, జాతీయ నాయకుల చరిత్రలు చదివించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

టూరిజం పార్కులో విద్యార్థుల సందడి



టూరిజం పార్కులో విద్యార్థులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం ఫారెస్టులో ఎత్తురోడ్డు వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన టూరిజం పార్కులో ఆదివారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆటల పోటీలో ఉల్లాసంగా పాల్గొన్నారు. టూరిజం పార్కులో ఊయ్యాలలు, జారుడు బల్లలు, తదితర ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలతో ఇక్కడి వచ్చి సాయంత్రం వరకు ఉండి సేద తీరి వెళుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ద్రావణ ఉపయోగాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: కందిలో పూత, కాయ తెగులు నివారణకు ఒరిజినల్ డికంపోజర్ ఉపయోగపడుతుందని యూనిట్ ఇన్‌చార్జి మందాకిని అన్నారు. మండలంలోని నేతివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒరిజినల్ వేస్ట్ డీకంపోజర్ అనే ద్రావణాన్ని తయారు చేసి రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ 50 మిల్లీలీటర్ల జీవన ఎరువును, 200 లీటర్ల నీటిలో రెండు కేజీల బెల్లం, ఇంగువ,మూడు లీటర్ల ఆవు పెరుగును మజ్జిగ చేసి అన్నింటినీ కలిపి కందికి స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ద్రావణం కందిలో తెగులు నివారణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు జ్యోత్స్న, సుహానా, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.